
కళ్లాల్లోనే మూలుగుతున్నాయ్!



టెక్కలి మండలం గంగాధరపేట సమీపంలో పంట పొలాల్లో మూలుగుతున్న ధాన్యం నిల్వలు

- పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయని సర్కార్
- కొత్తగా బ్యాంక్ గ్యారంటీలకు వెసులుబాటు
- గిట్టుబాటు ధర లేక మూలుగుతున్న సన్నరకాలు

టెక్కలి:

రైతులు అడుగడుగునా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఆదుకోవాల్సిన సర్కార్ తమకు పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడాన్ని గమనిస్తే అన్నదాతపై ప్రభుత్వం ఎంత చిన్నచూపు చూస్తుందో అర్థమవుతుంది. ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో చాలా చోట్ల ఇప్పటికీ కళ్లాల్లోనే మూలుగుతున్నాయి. కొనుగోలు విషయంలో ఇచ్చిన లక్ష్యాలు పూర్తయినట్టు రికార్డుల్లో చూపుతున్నప్పటికీ కళ్లాల్లో మాత్రం టన్నుల కొద్దీ ధాన్యం దర్శనమిస్తున్నాయి. లక్ష్యాలు పూర్తి చేసినట్లు లెక్కలు చూపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ధాన్యం కొనుగోలు విషయంలో మాయాజాలం జరిగిందా అనే సందేహాలు రైతులను వెంటాడుతున్నాయి. అయితే మరోసారి బ్యాంకు గ్యారంటీల కోసం వెసులుబాటు కల్పించడంతో గ్రామాల్లో కూటమి నాయకులకు చెందిన వారికి అనుకూలంగా ట్రక్ షీట్లు నమోదు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టెక్కలి నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

ఈ ఏడాది టెక్కలి నియోజకవర్గంలో 1,56,830 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయశాఖాధికారులు అంచనా వేశారు. ఇందులో 93,910 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు లక్ష్యం నిర్దేశించారు. లక్ష్యాన్ని అధిగమించి సుమారు 94,110 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపించారు. అయితే క్షేత్రస్థాయిలో ఎక్కడ చూసినా టన్నుల కొద్దీ ధాన్యం నిల్వలు కనిపిస్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అధికారులు చూపిస్తున్న లెక్కలను చూసి రైతులు కూడా విస్తుపోతున్నారు. కొన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్లు నమోదు విషయంలో టీడీపీ కార్యకర్తలు జోక్యంతో కేవలం వారికి అనుకూలంగా నమోదు ప్రక్రియ చేసుకుంటున్నారని.. మిగిలిన రైతులకు అవకాశం లేకుండా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

రైతులను నట్టేట ముంచారు



ఈ ఏడాది ధాన్యం కొనుగోలు విధానం బాగోలేదు. పంట కొనుగోలు విషయంలో మిల్లర్లకు పూర్తిస్థాయిలో వెసులుబాటు ఇవ్వడంతో ఇష్టారాజ్యంగా దోపిడీ జరిగింది. మిల్లర్లకు అనుకూలంగా దళారులు ట్రక్ షీట్లు నమోదు చేయించేశారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలు మూలుగుతున్నాయి. వీటితో పాటు రైతులు అధికంగా సన్నరకం ధాన్యం పండించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటా ధాన్యం రూ. 2100 నుంచి రూ. 2400 వరకు ధర ఉండేది. ఇప్పుడు రూ.1700 నుంచి రూ. 1800 వరకు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధరల కోసం రైతులు దిగాలు చెందుతున్నారు. –సత్తారు సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెక్కలి

టీడీపీ కార్యకర్తలే దళారీలు!



ధాన్యం కొనుగోలు విషయంలో టీడీపీ కార్యకర్తలే మిల్లర్లకు దళారీలుగా వ్యవహరిస్తున్నారు. ట్రక్ షీట్లు నమోదు విషయంలో వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు గిట్టుబాటు ధర లేక పూర్తి స్థాయిలో కొనుగోలు జరగడం లేదు. కోటబొమ్మాళి మండలంలో ధాన్యం కొనుగోలు విషయంలో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి రైతులను ఆదుకోవాలి. –ఎస్.హేమసుందర్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, కోటబొమ్మాళి

పీహెచ్‌సీ సందర్శన..



సంతబొమ్మాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ శుక్రవారం సందర్శించారు. వ్యాక్సిన్, కోల్డ్ సెల్ పాయింట్, నూతన భవనం, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి చెదలు పట్టి ఉండటాన్ని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయనతో పాటు డీఐ రామదాసు, వాన సురేష్‌కుమార్, స్వరూప్ స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శివరంజని ఉన్నారు. –సంతబొమ్మాళి

చలివేంద్రం ఏర్పాటు..



ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు గ్రామంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపి దీన్ని ఏర్పాటు చేయగా.. ఎంపీడీవో కె.రామారావు ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో ప్రయాణికులు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ–1 లక్ష్మీ బెహరా, కరగాన కృష్ణ, గరికపాటి చరణ్, తరిణీ బెహరా, సన్నా రాణో పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం రూరల్

వన్యప్రాణులను కాపాడాలి



వనాలను పెంచడం ద్వారా వన్యప్రాణులను సంరక్షించగలమని పలాస మండలం బ్రాహ్మణతర్లా జెడ్పీ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. జాతీయ హరితక్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల ఆధ్వర్యంలో అంతరించిపోతున్న జీవుల ఛాయా చిత్రాలను ప్రదర్శించి వాటి ప్రాధాన్యతను వివరించారు. అడవులను కాపాడటం వల్ల వన్యప్రాణులను, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటరు కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రమేష్, సుధాకుమారి పాల్గొన్నారు. –పలాస

క్లుప్తంగా

23న విద్యుత్ సరఫరా నిలిపివేత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబడం ఫీడర్ పరిధిలో ఈనెల 23న ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్తగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపడుతున్నందున పెంటిబద్ర గిరిజన ప్రాంతం, జయరాంచంద్రపురం, పద్మనాభపురం, పాతజాతీయ రహదారి, తాళ్లభద్ర,నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబడం, అంతరకుడ్డ, రాజపురం పరిసర ప్రాంతాలకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ముగిసిన శిక్షణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. పైతాన్ ఫర్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ, ఏఐ, డేటా సైన్స్ తదితర అంశాలపై శిక్షణ అందజేసినట్లు పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌డీ డీన్ డి.శ్రీరాములు, అధ్యాపకులు పి.దినకర్, ఎం.సురేష్, జి.ప్రసన్నకుమార్, జి.గౌరీశంకర్ ఉన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు తదితరులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు ఉద్దాన ప్రాజెక్టు నుంచి మంచినీరు అందించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెప్పారు. ఇందులో భాగంగా అక్కుపల్లి కూడలి వద్ద చేపడుతున్న పైప్‌లైన్ పనులను ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉద్దానం ప్రాజెక్ట్ నుంచి మంచినీటిని సరఫరా చేసేందుకు వీలుగా పనులు ప్రారంభించినట్టు కమిషనర్ వెల్లడించారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన



కాశీబుగ్గలోని శ్రీచైతన్య పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను కాశీబుగ్గ వి.వెంకటఅప్పారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద విధుల్లో పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

క్రీడలపై దృష్టి సారించాలి



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: యువకులు క్రీడలపై దృష్టిసారించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మొబైల్ ఫోన్లలో ఆటలకు బానిస కాకుండా మైదానంలో ఆటలు ఆడడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. కొల్లూరు గ్రామంలో వాలీబాల్ కోర్టును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వలభవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఘన నివాళి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

టెక్కలి: యూటీఎఫ్ వ్యవస్థాపకుడు అప్పారి వెంకటస్వామి ఆశయాలను కొనసాగించాలని ఆ సంఘం నాయకులు కోరారు. టెక్కలిలో వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాలను వివరించారు. నాయకులు పి.గణపతిరావు, పి.ధర్మారావు, కె.దాలయ్య, బి.అరుణ్‌కుమార్, టి.అప్పలస్వామి, వై.గణపతిరావు పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

టెక్కలి రూరల్: మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను చిత్తు చేసుకోవద్దని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. చాకిపల్లి గ్రామంలో సంకల్పం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలుగు నష్టాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగానికి అందరూ దూరంగా ఉండాలన్నారు.

చిన్నారుల్లో వికాస స్థాయిని పెంచాలి



వజ్రపుకొత్తూరు రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు



ఇచ్ఛాపురం టౌన్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో నాగరాణి

వజ్రపుకొత్తూరు రూరల్: చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం అందించడంతో పాటు వారిలో వికాస స్థాయిని పెంపొందించే విధంగా అభ్యాసన చేయాలని ఎంపీడీవో రమేష్ నాయుడు అన్నారు. వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం నిర్వహించిన 'పోషణ భి– పడాయి భి'శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్లలోపు చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి కార్యకర్తలు తోడ్పాటు అందించాలని అన్నారు. కీలకమైన ఈ వయస్సులో చిన్నారులలో పఠన స్థాయితో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలకు సమతుల్య అహారం అందించాలని ఐసీడీఎస్ పీవో పార్వతి తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్ ధనలక్ష్మి, యూ.లత, గంగమ్మ, సరస్వతి, జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల పోషణపై అవగాహన

ఇచ్ఛాపురం టౌన్: ఆరేళ్ల వయసు వచ్చే వరకు చిన్నారుల పోషణపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీవో నాగరాణి అన్నారు. ఈ విషయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా శ్రద్ధ వహించాలని అన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పిల్లల చదువు, పోషణపై స్థానిక జూనియర్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. చిన్నారుల పోషణ, ఆరోగ్యపరిరక్షణ, గర్భస్థ శిశుసంరక్షణ, ఆరోగ్యసూత్రాల విషయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సూపర్‌వైజర్లు బి.సుజాత, ఎస్.నీలవేణి, పి.పల్లవి, పి.పుష్పలత, జె.లక్ష్మి జి.కృష్ణవేణి పాల్గొన్నారు.

20 ఒడిశా బీరు బాటిళ్ల స్వాధీనం



కారులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఇచ్ఛాపురం: అక్రమంగా కారులో తరలిస్తున్న ఒడిశాకు చెందిన 20 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. కొజ్జిరియా గ్రామం వద్ద శుక్రవారం వాహనాలను తనిఖీలు చేస్తుండగా మామిడి విజయ్ అనే వ్యక్తి కారులో బీరు బాటిళ్లను తరలిస్తుండగా పట్టుబడినట్టు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి బీరుబాటిళ్లు, కారును స్వాధీనం చేసుకొని విజయ్‌ను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ప్రొహిబిషన్ ఎస్సై జి.సి.హెచ్.వి.రమణరావు, సిబ్బందిలక్ష్మణరావు, యోగేశ్వరరావు పాల్గొన్నారు.

బీల అభివృద్ధిపై దృష్టి



బారువ కంబ వద్ద బీల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పర్యాటకశాఖ అధికారి నారాయణరావు

సోంపేట: బీల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని జిల్లా పర్యాటకశాఖ అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. గొల్లగండి మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు గండుపల్లి చిన్న రాజారావు బీల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పెట్టుకున్న అర్జీ మేరకు పర్యాటకశాఖాధికారులు శుక్రవారం మండలంలోని ఇస్కలపాలెం, బారువ, పల్లి గొల్లగండి, బీల ప్రాంతంలో పర్యటించి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఇచ్ఛాపురం జనసేన పార్టీ సమన్వయకర్త దాసరి రాజు, ఆ పార్టీ ప్రతినిధులు బి.ఈశ్వరరావు ఉన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టిన పోలీసులు



జంగిల్ క్లియరెన్స్‌ను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని జరడా, కేశుపురం, ధర్మపురం రోడ్లలో మలుపులు, రోడ్డుకు ఇరువైపులా పొదలు ఉండటంతో పాటు సూచిక బోర్డులు లేక తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై 'ప్రమాదాలు–మలుపులు'శీర్షికతో శుక్రవారం 'సాక్షి'దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి పోలీసులు స్పందించారు. ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ ప్రొక్లయినర్ సహాయంతో జరడా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంతో స్థానికులు పోలీసులను అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కవిటి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలన్నారు.

నేడు యువజన సంఘ వార్షికోత్సవం

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామంలోని యువజన సంఘ 71వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవాల కరపత్రాలను సంఘ ప్రతినిధులు శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే సామ్రాజ్యవాద చెర నుంచి మాతృదేశ విముక్తి కోసం పోరాడిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవుల 94వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తామని సంఘ ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి నారాయణ, అధ్యక్షులు, గణేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మద్దిల రామారావు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరు అరెస్టు

పలాస: శాసనాం గ్రామానికి చెందిన కుప్పిలి నారాయణరావు, పెంటిభద్ర గ్రామానికి చెందిన సవర రాజకుమార్‌లు నాటు సారా కలిగి ఉండడంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించామని పలాస ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు కె. మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. వీరివద్ద నుంచి ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. శ్రీకాకుళం ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ముమ్మరంగా దాడులు చేస్తున్నామన్నారు.

బన్నువాడలో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

టెక్కలి: చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడిన వారిని శిక్షించేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. బన్నువాడ గ్రామంలో లైంగిక దాడులు–నివారణ చర్యలు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక దాడులు జరిగితే తక్షణమే పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ పోలాకి మోహనరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, న్యాయవాదులు ఎల్.బాలకృష్ణ, పి.ఆనందరావు, ఎస్సై కె.రాము, ఎంపీటీసీ సభ్యుడు పి.ఫాల్గుణరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- మంత్రి అచ్చెన్నాయుడు



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళి మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. స్థానిక రిపీటర్ కేంద్రంలో అభివృద్ధి పనులతో పాటు హుద్‌హుద్ భవనాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, ఆక్రమణల తొలగింపు విషయంలో తాత్సారంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నాయకులు కె.హరిప్రసాద్, బి.గోవిందరాజులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

- మండల సమావేశంలో సభ్యుల విజ్ఞప్తి



మంచినీటి సమస్యపై ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ గురుమూర్తి

ఇచ్ఛాపురం రూరల్: వేసవి తీవ్రరూపం దాల్చుతున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు సక్రమంగా మంచినీటి సరఫరా జరగడం లేదని, కొన్నిచోట్ల వృథాగా నీరు పోతున్నా పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, కొళిగాం సర్పంచ్ సంతోష్ మండలా తదితరులు అన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. బూర్జపాడు పంచాయతీలోని ప్రజలకు సరిపడా మంచినీరు లేకపోవడంతో వారంతా చెలమల నీటిని తాగుతున్నారని, జలజీవన్ మిషన్ ద్వారా పంపిణీ చేస్తున్న శుద్ధజలం లీకేజీలతో వృథాగా పోతుందన్నారు. బూర్జపాడు నుంచి నెలవంక వరకు బాగున్న తారు రోడ్డును మరమ్మతుల పేరిట తవ్వేసి వదిలేశారని, సుమారు 15 రోజులు అవుతున్నప్పటికీ అధికారులు పనులు చేపట్టకపోవడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ గురుమూర్తి అన్నారు. తమ పంచాయతీలో పలు సమస్యలకు అవసరమైన పనులు చేపట్టి అభివృద్ధి చేసేందుకు తీర్మాణాలు ఇస్తున్నప్పటికీ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని, కనీసం తమ పదవికి కూడా గౌరవించడం లేదని కొళిగాం సర్పంచ్ సంతోష్ మండలా ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఎంపీడీవో కె.రామారావు స్పందిస్తూ శనివారం నాటికి పంచాయతీకి అవసరమైన పనులకు తీర్మానం ఇస్తామని, అలాగే మండలంలో ఏ గ్రామంలోనైనా బోర్లు పాడైనట్టు తమకు తెలియజేస్తే 24 గంటల్లో సమస్యను పరిష్కారిస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఏ ఒక్క అధికారి కూడా పరిష్కారించడం లేదని, గ్రామ స్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను భాగస్వామ్యం చేయకపోవడాన్ని నిరసిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి కేశుపురం ఎంపీటీసీ సభ్యుడు మాసుపత్రి చక్రవర్తిరెడ్డి సభ నుంచి వెళ్లిపోయారు. విద్యుత్, వ్యవసాయ, పశు సంవర్ధక, ఉపాధి శాఖాధికారులపై సభ్యులు అసంతృప్తికి గురయ్యారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీవో కె.రామారావు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: శక్తియాప్‌పై అవగాహన కలిగి ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ అన్నారు. మండపల్లి గ్రామ సచివాలయంలో శక్తి యాప్‌పై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ సెల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట శశిరేఖ, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపి, నాయకులు పిట్ట మామయ్యరెడ్డి, వీఆర్వో మద్దిలి నీలవేణి, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరుచుకోవాలి

సోంపేట: డిగ్రీ విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు మెరగుపరుచుకోవాలని బీఆర్‌ఏయూ బీసీడీఈ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో బీసీడీఈ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో ప్రేరణ మిత్ర కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రేరణ మిత్ర యాప్‌తో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగవుతాయన్నారు. కళాశాల చైర్మన్ ఎన్ని దేవరాజు, ప్రిన్సిపాల్ బొడ్డ శ్రీరామమూర్తి, ఏవో వి.పాపారావు పాల్గొన్నారు.

జీడి కార్మికురాలికి ఆర్థికసాయం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటో వార్డు మొగిలిపాడు గ్రామానికి చెందిన జీడి కార్మికురాలు సైని సరస్వతి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈమె ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో మొగిలిపాడు గ్రామానికి చెందిన అభ్యుదయ యువజన సంఘం సభ్యులు, పెద్దలు రూ.21,700 సేకరించారు. ఈ మొత్తాన్ని సరస్వతి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

ప్రారంభమైన సిరిమాను ఉత్సవాలు



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న గ్రామస్తులు

టెక్కలి: పోలవరం గ్రామంలో పాశిపోలమ్మ సిరిమానోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ సమీపంలోని వంశధార కాలువ గట్టుపై ఉన్న రావిచెట్టు నుంచి సంప్రదాయబద్ధంగా దేవరను గ్రామంలోకి తీసుకువచ్చి పూజలకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మేళతాళాలతో సందడిగా ఊరేగింపు నిర్వహించారు.